

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

భర్తని కలిసి, ఇద్దరూ ఇంటికి భోజనానికి వెళ్ళడానికి వచ్చింది డా.స్నేహ.

రాధిక ని చూస్తూనే దగ్గరగా వచ్చి " రాధీ, ఎలా ఉన్నావు? పిల్లలు బావున్నారు కదాఈ మధ్యన కలవనే లేదు మనం" అంటూ పలకరించింది.

రాధిక కూడా సంతోషంగా ఎదురువెళ్ళి " అవును డాక్టర్, కొంచం బిజీ అయిపోయాము స్వప్ని ప్రాక్టీస్, రేసులు, అవీ. మీరు ఎలా ఉన్నారు?" అంటూ చెయ్యి పట్టుకుంది.

" ఓ, ఫైన్. ఎప్పట్లాగే పిల్లల్ని నిజమైన స్వర్గం లోంచి భూమ్మీదకి పడేయడంలో" అంటూ నవ్వింది.

మనోహరంగా ఉండే ఆమె నవ్వునే చూస్తూ ఉండిపోయింది రాధిక ఓ క్షణం పాటు.

" ఎంత చక్కగా నవ్వుతుందీవిడ! ఎంత చల్లగా మాట్లాడుతుంది. ఇంత స్నేహశీలి అవుతుందనే వాళ్ళ అమ్మా నాన్న 'స్నేహ' అని పేరు పెట్టి ఉంటారు"

ఎన్నో ఏళ్ళుగా తెలిసినా, డాక్టర్ కంటేఎక్కువగా స్నేహితురాలిగా మారినా కూడా స్నేహను చూడగానే రాధిక మనసులో కదిలే మాటలివే.

ఐదడుగుల ఆరంగుళాల ఎత్తూ, అందమైన రూపం, ఎప్పుడూ నవ్వే కళ్ళూ, చిన్ననవ్వుతోనే ముఖమంతా పాకే వెలుగు. ఎవరినీ నొప్పించని తత్వం డా. స్నేహ స్వంతం.

'మీ పేరుకు తగ్గట్టే మీరెంత స్నేహంగా ఉంటారో!' ఎన్నిసార్లు అందో ఆ మాట ఆవిడతోనే.

" అంతా బావున్నారు కదా, రాజేష్ దగ్గరకొచ్చారంటే డౌట్ వచ్చి అడిగాను అంతే" అందావిడ అదే చిరునవ్వుతో.

" హలో డాక్టర్ ఆంటీ!" రాజేష్ ఆఫీస్ రూం లోంచి బయటకువస్తున్న స్వపిక పలకరించింది స్నేహని..

" హలో బంగారు తల్లీ, ఇంకెన్ని మెడల్స్ కొట్టావీమధ్యలో! అరే భలే పొడుగయ్యావే" అంది కూడా.

నవ్వింది స్వప్నిక.

" స్వప్నికే జ్వరం గా ఉంటే ఒకసారి డాక్టర్ గారిని చూసి వెళ్దామని వచ్చాము" అంది రాధిక.

" ఏదీ చూడనీ" అంటూ స్వప్నిక నుదురు తాకి చూసి, పరవాలేదు. తగ్గిపోతుంది కాదు కాదు పరిగెత్తి పారిపోతుంది" అంది నవ్వుతూ.

ఆ మాటలకి అందరూ నవ్వారు.

" ఆంటీ, మళ్ళీ నేను బయాలజీ, కెమిస్ట్రీల్లో టాప్ చేశాను. చెప్పాను కదా, మీలాగే డాక్టర్ అవుతాను. పిడియాట్రీషియన్.

వెరీ గుడ్, అలా అయితే నా పక్కనే ప్రాక్టీస్ పెట్టేసుకోవచ్చు. నా పేషెంట్ల పిల్లలందరూ నీ పేషెంట్లు. అంది స్నేహ సరదాగా.

“అన్నట్టు నేను ఇప్పుడు చెయ్యి కాల్చుకోకుండా చపాతీలు చేసెయ్యగలను తెల్సా" అంది స్వప్నిక.

" అలాగా, గుడ్. క్రిందటిసారి డాక్టర్ అంకుల్ పుట్టినరోజుకి కలిసినపుడు నీకు టీ, మాగీ చెయ్యడం మాత్రమే వచ్చు, కదూ" అంది స్నేహ.

" కరక్ట్.అందుకే చెప్పాను, అయినా మీరు భలే గుర్తు పెట్టుకుంటారు అన్నీ. అంది స్వప్నిక.

ముగ్గురు ఆడవాళ్ళ మధ్యనా జరుగుతున్న సంభాషణని వింటున్నాడు కిరణ్.

" కిరణ్, ఈ మధ్యన ఏమీ పోటీలకి చిత్రాలు పంపలేదా? మన క్లినిక్ పెట్టి పదిహేనేళ్ళవుతున్న సందర్భంలో ఒక చిన్న సావనీర్ తేవాలని అనుకుంటున్నాము. దాని కవర్ పేజీగా ఏదైనా మంచి ఫోటో ఇవ్వగలరా మీకు వీలుంటే? లేదంటే ఎవరైనా ఆర్టిస్ట్ తో గీయిద్దాం. రాజేష్ చెప్తాను అన్నారు, చెప్పారో లేదో అని నేను గుర్తు చేస్తున్నాను. చిన్న ఫంక్షన్ అనుకుంటున్నాం. దానికి ఫోటోలు, విడియోలు ఎలాగూ మీరే అనుకోండి" అంది.

" మొన్నొకరోజు ఫోన్ చేసి క్లుప్తంగా చెప్పారు. ఈ ఆదివారం కలుద్దాం అనుకున్నాం. ఇంతలో ఇలా రావలసి వచ్చింది" అన్నాడు కిరణ్.

ఆరోజుకి పని ముగించుకుని బయటకు వచ్చిన రాజేష్ కూడా జతకలిసారు వీళ్ళతో. మరో పది నిమిషాల తర్వాత వీడ్కోళ్ళు చెప్పుకుని ఎవరిళ్ళకి వారు బయలుదేరారు.

ముగ్గురూ ఆటో ఎక్కాకా, రాధిక అంది.

" ఈ డాక్టర్లిద్దరూ మనకి పరిచయం అవడం మన అదృష్టం. ఎంత హాయిగా ఉంటుందో వాళ్ళతో మాట్లాడితే! సగం జబ్బు అక్కడే తగ్గిపోతుంది. నిజంగా 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటే వీళ్ళిద్దరే!" అంది.

"కరక్టే, వాళ్ళిచ్చిన మందుతో మన స్వప్నిగాడి జ్వరం కూడా అలాగే తగ్గిపోతుంది" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

స్వప్నిక నవ్వింది తండ్రి మాటలకి.

"స్నేహ ఆంటీ చీర ఎంత బావుందో, ఆకలర్ నాకు చాలా నచ్చింది, నువ్వు కూడా అలాంటిది కొనుక్కో." అంది.

నవ్వింది రాధిక.

డాక్టర్ స్నేహ సెలెక్షన్ చాలా బావుంటుంది. ఆవిడ చీరలు, చూడీదార్లు, సింపుల్ గా ఉండే నగలూ అన్నీ బావుంటాయి. ఆవిడకి సూట్ అయ్యి మరింత అందంగా హుందాగా కనబడేలా ఉంటాయి.

అదే మాట వారితో అంటే ' స్నేహ సెలెక్షన్ బావుంటుందని మీకిప్పుడు తెల్సింది, నాకు మా పెళ్ళప్పుడే తెలిసింది" అంటారు రాజేష్ నవ్వుతూ.

ఆమాటలు గుర్తొచ్చి రాధికకి నవ్వొచ్చింది.

" రాధీ, నా కొలీగ్ విజయ తన పాత కార్ అమ్మేస్తాను అన్నాడు. నీకు కావాలంటే తీసుకో, సగం ఇప్పుడిచ్చి, మిగతా సగం మూడుసార్లుగా ఇవ్వు, నాకేమీ పరవాలేదు అన్నాడు. మన సంగతి తెలిసినవాడు కదా. మంచి కండీషన్ లో ఉంది, మరీ పాతది కాదు. బావుంటుంది. ఒక సారి చూసి వద్దాం. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు, బాగా పొడుగవుతున్నారు. రెండు స్కూటర్ల మీద వెళ్ళడం కూడా ఇబ్బందిగా ఉంది కదా" అన్నాడు.

రాధిక తల ఊపింది.

" కారా నాన్నా, వెరీ గుడ్" అని స్వప్నిక సంబరపడింది.

మాటల్లోనే ఇల్లు చేరారు.

రాగానే స్వప్ని 'ఆకలి లేదు, ఏమీ తినను. టీ.వీ చూస్తాను' అంటూ కూర్చుంది.

రాధిక ఏదో చెప్పబోతుంటే " ఇద్దరూ కలిసి తింటార్లే రాధీ, మరో గంటలో సాహిల్ వచ్చేస్తాడు కదా" అన్నాడు.

పెద్దవాళ్ళిద్దరూ భోజనాలు ముగించారు. భోజనమయ్యాకా కిరణ్ యూనివర్సిటీకి వెళ్ళాడు. రాధిక వంటింట్లో పనులు ముగించుకోవడంలో బిజీ అయింది.

టీవీ చూస్తూనే ఎప్పుడో పక్కకి వాలిపోయి నిద్రపోయింది స్వప్ని.

" అక్కా, లే, ఆకలి. నువ్వు నాకోసమే కూర్చున్నావని అమ్మ చెప్పింది. త్వరగా లే" అని సాహిల్ తట్టి లేపుతుంటే మెలకువ వచ్చి ఉలిక్కిపడి లేచింది.

" అమ్మ ఏం వండిందో తెల్సా? చేమగడ్డ వేపుడు, మామిడికాయ పప్పు, రెండూ నా ఫేవరిట్సే. దా తినేద్దాం. ఆకలి" అంటూ పొట్ట పట్టుకుని అభినయిస్తున్న తమ్ముడిని చూసి నవ్వుతూ నిటారుగా కూర్చుంది.

" చలో" అంది.

ఇద్దరూ కంచాలు పెట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ తినడం మొదలు పెట్టారు.

స్కూల్ కబుర్లు, బస్ లో తన స్నేహితుడు బబుల్ గం తింటే ఆయా కోప్పడి పడేయించడం లాంటి విశేషాలన్నీ కథలుగా చెప్తున్నాడు సాహిల్.

" మా సైన్స్ టీచర్ కళా మిస్ మంచావిడ, సోషల్ టీచర్ రూపల్ మాత్రం బాగా స్ట్రిక్ట్. నీకు కూడా వాళ్ళేనా అప్పుడు?" అడిగాడు.

" కళా మిస్ సేం, రూపల్ మిస్ ఈ మధ్యనే వచ్చారు కదా, మాకు అప్పుడు స్వాతి మిస్ ఉండేవారు." ఇలా సాగుతున్నాయి వాళ్ళ మాటలు.

మూడో కుర్చీలో కూర్చుని ఇద్దరి మాటలు వింటూ వాళ్ళిద్దరినే చూస్తోంది రాధిక.

" అక్కా, నువ్వింత నెమ్మదిగా తింటున్నావెందుకు? నేను అప్పుడే రెండు సార్లు కూర తినేసి పప్పులోకి వచ్చేశాను. నువ్వింకా మొదటి సారి కూరలోనే ఉన్నావు" అన్నాడు ఆటపట్టిస్తున్నట్టుగా.

" అవును స్వప్నీ, వాడన్నది నిజమే.మీ ఇద్దరికీ చేమగడ్డ ఫ్రై అంటే చాలా ఇష్టం కదా, పోటీలు పడి తింటారుగా. త్వరగా తిను. నేను కలిపి పెట్టనా పోనీ" అంది రాధిక.

" వద్దమ్మా, నేను తినేస్తాలే" అని బలవంతంగా కూరుకుని తిన్నాననిపించింది.

అక్కా తమ్ముళ్ళ భోజనాలు పూర్తయ్యాయి.

"నేను రేపు స్కూల్ కి వెళ్ళిపోతాను అమ్మా, ఇలా అయితే చాలా క్లాస్ లు మిస్ అవుతాను. నోట్స్ అవీ కూడా పెండింగ్ అయిపోతాయి" అంది స్వప్నిక.

" తప్పకుండా, మందువేసుకుని పడుకో ముందు. రేపటికల్లా తగ్గిపోతుంది" అంది రాధిక రాజేష్ ఇచ్చిన మందు వేస్తూ.

" హమ్మయ్య, నువ్వు పడుకుంటే, నేను నాక్కావల సిన కార్టూన్ చూసుకోవచ్చు" అన్నాడు సాహిల్ తుంటరిగా.

తమ్ముడిని కొట్టబోతున్నట్టు అభినయించింది స్వప్నిక. ముగ్గురూ నవ్వుకున్నారు.

ఈ హడావిడిలో టీవీ రిమోట్ పట్టుకుని తుర్రుమన్నాడు సాహిల్.

న్యూస్ పేపర్ చదువుతూ మంచం మీద కూర్చుంది స్వప్నిక.

" అమ్మా, రేస్ రోజు పడిపోయినప్పుడు ఇంకేమైనా జరిగిందా? అని అడిగారు కదా డాక్టర్ అంకుల్. నాకేమీ గుర్తు లేదు, రావడం లేదు. నువ్వేమైనా చూశావా? ఎనీథింగ్ అన్ యూజువల్" అంది తల్లిని చూస్తూ.

కూతురి పక్కన మంచం మీద కూర్చున్న రాధిక

" ఏమీ లేదురా, మామూలుగానే లైన్ లో నిలబడ్డావు. మమ్మల్ని చూసి చెయ్యి ఊపావు. నాన్న ఎప్పట్లాగే మేము ఇక్కడే ఉంటాము, నీ ఫోకస్ లైన్ మీద, పందెం మీద అంటూ సైగలు చేశారు. నువ్వు నవ్వుతూ బొటనవేలు చూపించావు. ఆ తర్వాత రేస్ మొదలైంది.ఎప్పట్లాగే బాగానే పరిగెత్తావు. కానీ చివరికి వచ్చేసరికి ఏమయిందో మరి ముందుకు పడ్డావు. ఎంత వేగంగా జరిగిందంటే మేము గమనించేసరికే కొన్ని క్షణాలు పట్టింది " అంది రాధిక.

" యా, షార్ట్ రేస్ కదా అమ్మా, చాలా త్వరగా అయిపోతుంది కదా వంద మీటర్లది, ఆ మాటకొస్తే రెండువందలది కూడా పెద్ద టైం పట్టదు" అంది స్వప్నిక.

" అదే, నిజమే, అందుకే ఏమయిందని కూడా తెలియలేదు మాకు. ఏదైనా తూలి పడ్డవేమో అనుకోవడానికి అదేమీ రాళ్ళు రప్పలు ఉండే దారి కాదు కదా, చక్కగా శుభ్రం చేసిన ట్రాక్ లు. ఏదైనా తగిలి పడే ఛాన్స్ ఉండదు కదా"

" అదీ నిజమే, ఏదీ తగిలే అవకాశమే లేదు. మరి నాకేమైంది?" అంది స్వప్నిక.

" ఎండాకాలం కదా, ఎంత వేడిగా ఉందో! ఆరోజు. ప్రాక్టీస్ కూడా ఈ మధ్య బాగా ఎక్కువగా చేస్తున్నారు కదా. అసలే అలసిపోయావేమో, దానికి తోడు ఎర్రటి ఎండ. అందుకే పడిపోయి ఉంటావు" అంది రాధిక.

" కాదమ్మా, ఇంతకంటే టఫ్ రేసులు ఎన్ని పరిగెత్తాను కదా. ఈ సారే ఎందుకిలా జరిగింది?

అయినా ఎండ నా ఒక్కదానికే కాదుగా, అందరికీ అంతే ఎండా, అదే ఎండా కదా. నా ఒక్కదానికే ఇలా ఎందుకయింది?"

'కడగి యేనుగు మీద కాయు యెండొకటే,పుడమి శునకము మీద బొలయు యెండొకటే'. అన్నమాచార్యుని కృతి గుర్తొచ్చింది రాధికకి.

“అవును తల్లీ, అందరికీ ఎండ ఒకటే అనుకో, కానీ తట్టుకునే శక్తి వేరేగా ఉండచ్చు కద. నువ్వు స్ట్రాంగ్ స్పోర్ట్స్ వుమన్ వే కాదనను, కానీ ఆరోజు కొద్దిగా వీక్ అయి ఉండవచ్చు.

తాతగారు ఫోన్ చేసినప్పుడు కూడా అదే అన్నారు, మా స్వప్ని తల్లి చాలా స్ట్రాంగ్ అని.  అన్నట్టు , నీకు చెప్పానా?  మన ఇంట్లో ఎర్రావుకి చిన్న బేబీ కాఫ్ పుట్టిందిట. ఎంత ముద్దుగా ఉందో! అని చెప్పారు. స్వప్ని గాడికోసం నాయనమ్మ జున్ను వండి పంపుతుంది అని చెప్పమన్నారు కూడా.”  అంది మాట మారుస్తూ.

" అవునా, హౌ స్వీట్. కాఫ్ ఫోటో పంపించమని చెప్పారా, జున్ను ఎప్పుడు వస్తుంది. నాకెంత ఇష్టమో, నాయనమ్మ చాలా బాగా చేస్తుంది. బెల్లం, మిరియాలు, ఏలకులు వేసి" అంటూ సంబరంగా చెప్పింది.

" తాతగారికింకా ఫోటోలు పంపడం రాదుగా, పక్కింటి రాము కాలేజ్ నించి వచ్చాకా అతనికి చెప్పి పంపిస్తాను అన్నారు. జున్ను కూడా తాతగారి ఫ్రెండ్ రంగయ్య గారు రాత్రికి వస్తారుట, ఆయనతో పంపిస్తామన్నారు" అంది.

" వెరీ నైస్. నా జ్వరం తగ్గిపోయాకా మనం ఊరెళదాం అమ్మా, కాఫ్ ని చూడాలి, దానితో ఆడుకోవాలి" అంది నవ్వుతూ.

" ఓ తప్పకుండా వెళదాం. నువ్వు పడుకుంటావా?" అంది మరో సారి జ్వరం చెకి చేసి పక్కనే పెట్టుకున్న పుస్తకంలో టైం రాసి పక్కన ఆ రీడింగ్ వేస్తూ.

" ఎక్కువ నిద్ర రావడం లేదు. ఫేమస్ ఫైవ్ చదువుతూ పడుకుంటా" అంది స్వప్నిక.

అన్న మరో మూడు నిమిషాలకే నిద్రలోకి జారిపోయింది.

కూతురికి పల్చటి దుప్పటి కప్పి 'నూట ఒక టి' అని తను వేసుకున్న రీడింగ్ వైపు చూస్తూ కూర్చుంది రాధిక.

ఈ పరుగు వచ్చే నెల దాకా.

Post your comments